సాక్షి ఒడిశా

గురువారం ‌। 27 ‌। జూలై ‌। 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ. 3,95,060లు, బంగారం 11.2 గ్రాములు, వెండి 232.45 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



డీపీఆర్ సర్వే ప్రారంభం

● మజ్జిగౌరి మందిరం అభివృద్ధి పనులకు సన్నాహాలు

- 8లో



కేకే లైన్‌లో వాల్తేర్ డీఆర్ఎం పర్యటన

- 8లో

న్యూస్‌రీల్

యూకే మాజీ ప్రధానితో సీఎం భేటీ



టోనీ బ్లెయిర్‌తో చర్చిస్తున్న సీఎం నవీన్

భువనేశ్వర్: యునైటెడ్ కింగ్‌డమ్(బ్రిటన్) మాజీ ప్రధానమంత్రి సర్ టోనీ బ్లెయిర్ నవీన్ నివాస్‌లో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను బుధవారం కలిశారు. ఒడిశా ఆర్థికాభివృద్ధి, భవిష్యత్ దృక్పథాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ టోనీ బ్లెయిర్‌ను కలవడం ఆనందంగా ఉందన్నారు. వివిధ రంగాల్లో రాష్ట్ర విజయాలు, పాలనలో పరివర్తనకు ప్రవేశపెట్టిన 5టీ చొరవను ప్రశంసించారని తెలిపారు. ప్రభుత్వ విధానాలు, రాష్ట్ర సమగ్ర ఆర్థిక వ్యూహాన్ని అభివృద్ధి చేయడంలో సహాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర పౌరుల సమగ్ర ప్రయోజనాలపై టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్(టీబీఐ) దృష్టి సారించి, సూచనలను జారీ చేసినట్లు వివరించారు.

చిరు వ్యాపారులకు అండగా..



చిరు వ్యాపారికి గొడుగు అందిస్తున్న క్లబ్ సభ్యులు

రాయగడ: స్థానిక మహిళా వాకర్స్ క్లబ్ పట్టణంలోని రోడ్డుపై వ్యాపారాలు కొనసాగిస్తున్న వారికి అండగా నిలిచారు. ఎండ, వానకు వారు ఇబ్బందులు పడకుండా గొడుగులను బుధవారం పంపిణీ చేశారు. ఏటా చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా గొడుగులను వితరణ చేసేందుకు నిర్ణయించామని క్లబ్ అధ్యక్షురాలు డి.శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

రివాల్వర్‌తో కాల్చుకొని ఎస్ఐ ఆత్మహత్యాయత్నం



ఇన్‌స్పెక్టర్ నరేంద్ర బిస్వాల్(ఫైల్)

కొరాపుట్: సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకొని పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో విధి నిర్వాహణలో ఉన్న నరేంద్ర బిస్వాల్ బుధవారం ఈ ఘటనకు పాల్పడ్డారు. తన రివాల్వర్‌తో మెడపై కాల్చుకొని కుప్ప కూలిపోయారు. శబ్దం విన్న తోటి సిబ్బంది హుటాహుటిన సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఉన్నత చికిత్సం నిమిత్తం విశాఖపట్నానికి రిఫర్ చేశారు. కాల్పుల శబ్దం విన్న వెంటనే ఎస్పీ అభినవ్ శంకర్ అక్కడికి చేరుకున్నారు. ఆస్పత్రిలో వైద్యులతో స్వయంగా మాట్లాడి, తరలించే ఏర్పాట్లు పర్యవేక్షించారు. నరేంద్ర స్వస్థలం బొలంగీర్ జిల్లా. మావోయిస్టుల నిర్మూలన విభాగంలో ఆయన క్రియాశీలకంగా పనిచేస్తున్నారు.

వీరులకు వందనం..



సైనికులకు నివాళులర్పిస్తున్న కమాండర్

పర్లాకిమిడి: భారత్–పాకిస్తాన్ మధ్య జరిగిన కార్గిల్ పోరులో సాధించిన విజయానికి చిహ్నంగా కార్గిల్ దివస్ నిర్వహించుకుంటున్నట్లు ఎమ్మెల్యే కె.నారాయణరావు అన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో జవాన్లకు చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి, పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ సాధారణ కార్యదర్శి జగన్నాథ మహాపాత్రో, ఈ.సంతోష్, సీనియర్ నాయకులు ఛిత్రి సింహాద్రి, గుసాని సమితి నాయకులు గేదెల శ్రీధరనాయుడు, యువమోర్చా నాయకులు కోట్ల యువరాజ్, ప్రశాంత్‌కుమార్ పాలో, కోడూరు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పూర్ ఆర్మీ శిబిరంలో..

బరంపురం: గోపాలపూర్ సమీపంలోని గొళాబంద ఆర్మీ శిబిరంలో ఉన్న ఏఐఎంఎ ఆడిటోరియంలో జిల్లా సైనిక సంక్షేమ కేంద్రం ఆధ్వర్యంలో కార్గిల్ దివస్ నిర్వహించారు. కమాండర్ జగ్గీ అమర సైనికులకు నివాళులర్పించారు. బరంపురం శివారు జగవల్‌పూర్‌కు చెందిన సైనికు శ్రీనివాస్ పాత్రో కార్గిల్ పోరులో వీర మరణం పొందారు. ఈ నేపథ్యంలో ఆయన విగ్రహానికి రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థలు నివాళులర్పించారు.

- భద్రతా నియమాలు విడిచి, విద్యార్థుల చెంతకు రాష్ట్రపతి
- చిన్నారులకు చాకెట్లు పంచుతూ ఆత్మీయ పలుకరింపులు
- నేతాజీ మ్యూజియం సందర్శనలో భావోద్వేగం
- రాజ్‌భవన్‌లో నిరాడంబరంగా వార్షికోత్సవాలు

హద్దుల్లేని ఆత్మీయత..



భద్రతా నిబంధనలు అధిగమించి విద్యార్థులకు చేరువలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



చండీ ఆలయంలో పూజలు చేస్తున్న రాష్ట్రపతి



నేతాజీ వినియోగించిన వస్తువులను రాష్ట్రపతికి చూపిస్తున్న అధికారులు

భువనేశ్వర్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండో రోజు రాష్ట్ర పర్యటనలో భాగంగా బుధవారం కటక్ మహానగరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చండీఛక్ వద్ద రాష్ట్రపతికి ఆత్మీయంగా స్వాగతం పలికేందుకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. తనదైన శైలిలో రాష్ట్రపతి హోదాను వదిలి.. సామాన్య మహిళగా తన రాకకోసం నిరీక్షిస్తున్న ప్రజల వద్దకు చేరుకున్నారు. అత్యంత కట్టుదిట్టమైన భద్రతా వలయాన్ని విడిచి, స్వయంగా పిల్లలకు చాక్లెట్లు పంచుతూ ముచ్చట గొలిపించారు. ప్రజాదరణకు హద్దులు తగదని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మరోసారి ప్రత్యక్షంగా ఉద్ఘాటించారు. కటక్ సందర్శన పురస్కరించుకుని నగరవాసుల ఆరాధ్యదైవం చండీమాత ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు జరిపారు. ఆమెతో పాటు గవర్నర్ గణేషీలాల్ కూడా పూజల్లో పాల్గొన్నారు. అనంతరం శైలబాల మహిళా అటానమస్ కళాశాల ఆవరణలోని



మధుసూదన్ దాస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



మ్యూజియంలో నేతాజీ సుభాష్‌చంద్ర బోస్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ద్రౌపదిముర్ము

ఉత్కళ గౌరవ్ మధుసూదన్ దాస్ నివాసానికి వెళ్లి, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్‌చంద్ర బోస్ జన్మస్థలం, మ్యూజియంను సందర్శించారు. బోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మ్యూజియంలో భద్రపరిచిన జ్ఞాపకాలకు ప్రతీకగా సర్ది ఉంచిన పలు అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, మహానాయకునికి మనసారా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె ఒకింత భావోద్వాగానికి గురయ్యారు. రాష్ట్రపతి సందర్శించిన ఈ ప్రాంగణాలతో పూలతో ప్రత్యేకంగా ముస్తాబై పరిసరాలను గుభాళించాయి.

వైద్య విద్యార్థులతో చర్చ..

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 3 రోజుల రాష్ట్ర పర్యటన వైద్య విద్యార్థులతో చర్చా కార్యక్రమంతో ప్రారంభం కావడం విశేషం. వీరంతా అతుట్ బంధన్ వర్గీయులు కావడం విశేషం. అతుట్ బంధన్ సంస్థ సౌజన్యంతో ఈ బాలలు వైద్య విద్యాభ్యాసం పొందుతున్నారు. ఈ నేపథ్యంలో వైద్యులుగా సామాజిక పాత్ర, మానవీయ విలువలను రాష్ట్రపతి ఈ విద్యార్థులకు వివరించారు. రాష్ట్ర పర్యటన పురస్కరించుకుని రాజ్‌భవన్‌లో విడిది చేసిన సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. గవర్నర్ గణేషీలాల్ ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాలుపంచుకున్నారు. అనంతరం రాజ్‌భవన్ సముదాయంలోని కళింగ అతిథి భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.



చర్చా కార్యక్రమానికి హాజరైన అతుట్-బంధన్ వైద్య విద్యార్థులు



రాజ్‌భవన్‌లో కేక్ కట్ చేస్తున్న ద్రౌపది ముర్ము

వార్షికోత్సవం..

భారత రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము తొలి ఏడాది పూర్తి చేసుకున్నారు. భారత రాజ్యాంగం అత్యున్నత హోదాలో ఏడాది పాలన దిగ్విజయంగా పూర్తి చేయడం అత్యంత అద్భుత ఘట్టమని గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్ కొనియాడారు. దేశ ప్రథమ మహిళగా ఏడాది కాలం పాలన పూర్తి చేసుకున్న ముర్ము.. ఈ సమయంలో రాష్ట్ర పర్యటనలో ఉండటం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. స్థానిక రాజ్‌భవన్‌లో బుధవారం బస చేసిన ఆమెకు.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వేడుకలను రాజ్‌భవన్‌లో నిరాడంబరంగా నిర్వహించారు. గవర్నర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ వేడుక జరగడం విశేషం. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేక్ కోసిన ద్రౌపది ముర్ము.. గవర్నర్, అనుబంధ వర్గాలతో ఆనందం పంచుకున్నారు.

అట్టడుగు ప్రజలకు సైతం న్యాయం చేయాలి

- న్యాయ విద్యార్థులకు పిలుపు



విద్యార్థినికి మెడల్ ప్రదానం చేస్తున్న రాష్ట్రపతి ముర్ము

భువనేశ్వర్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కటక్ నేషనల్ లా యూనివర్సిటీ(ఒడిశా) స్నాతకోత్సవంలో పాల్గొని ప్రసంగించారు. రాజ్యాంగ ఆదర్శాలను పాటించడంలో విద్యార్థులు దృఢంగా ఉండాలని కోరారు. దేశ ప్రాధాన్యతల పట్ల సున్నితంగా ఉండాలని సూచించారు. జాతీయ ప్రాధాన్యతలకు సహకరించేందుకు సాధ్యమైనంత వరకు ప్రయత్నాలు చేయాలన్నారు. ఒడిశా నేషనల్ లా యూనివర్శిటీ 'సత్యే స్థితో ధర్మః' అనే నినాదాన్ని ప్రస్తావిస్తూ.. సత్యంతో ధర్మం ఇమిడి ఉంటుందని సూచిస్తుందని తెలిపారు. ప్రాచీన భారతదేశంలో న్యాయస్థానాలను వర్ణించడానికి తరచుగా ఉపయోగించే రెండు పదాలు 'ధర్మసభ', 'ధర్మాధికారం' అని గుర్తుచేశారు. భారత రాజ్యాంగం ధర్మంతో ఇమిడి ఉందని, నేటి ఆధునిక భారతదేశానికి అత్యున్నత చట్టం రాజ్యాంగంగా ప్రబోధించారు. ఈరోజు ఉత్తీర్ణులయ్యే యువ విద్యార్థులతో సహా మొత్తం న్యాయవాదులంతా పవిత్ర గ్రంథంగా రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలన్నారు. తోటి పౌరులకు సహాయం చేసే స్థితిలో ఉన్న ప్రతి భారతీయుడు మహిళలతో సహా దేశ జనాభాలోని బలహీన వర్గాలకు సమాన అవకాశం, గౌరవం కల్పించేందుకు అత్యంత ప్రాధాన్యతతో వ్యవహరించాలని ఆకాంక్షించారు.

మధుసూదన్ దాస్ స్మరణలో..

దేశంలో అత్యధిక సంఖ్యలో మన తోటి పౌరులు న్యాయవ్యవస్థ పట్ల కనీస అవగాహన లేకుండా అనుబంధ వనరుల కొరతతో బలహీనమైన పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారని రాష్ట్రపతి ముర్ము అభిప్రాయం వ్యక్తంచేశారు. వారి హక్కులు, అర్హతల గురించి తెలియజేయడం నేటి ఉత్తీర్ణ యువత బాధ్యతగా స్వీకరించాలన్నారు. అట్టడుగు వర్గాల ఉపశమనం లేదా న్యాయం కోసం న్యాయస్థానాలను ఆశ్రయించే సౌకర్యాలు అంతంత మాత్రమే అని పేర్కొన్నారు. తమ వృత్తిపరమైన సమయంలో కొంత భాగాన్ని ఇటువంటి బలహీన వర్గాలకు సేవ చేసేందుకు కేటాయించడం కర్తవ్యంగా పరిగణించాలని పిలుపునిచ్చారు. భారత స్వాతంత్ర్య పోరాటానికి అర్హత కలిగిన న్యాయవాదులు నాయకత్వం వహించినట్లు తెలిపారు.

కంగుర్‌కొండ వంతెనపైకి వరద

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఎంవీ–96 పరిధిలోని కంగుర్‌కొండ వంతెనపై 3అడుగుల మేర వరదనీరు చేరింది. దీంతో మల్కన్‌గిరి–మోటు మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. మంగళవారం కురిసిన భారీ వర్షానికి మరోసారి వరద వచ్చి చేరడంతో కలిమెల నుంచి పొడియా సమితికి వెళ్తున్న మార్గంలో ఉన్న కాన్యాశ్రమం నీట మునిగింది. అందులో ఆశ్రయం పొందుతున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. జిల్లాలో 3.45 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. అలాగే ప్రభుత్వ అధికారులకు సెలవులు రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ విశాల్‌సింగ్ వెల్లడించారు.



వంతెనకు ఇరువైపులా నిలిచిపోయిన ప్రయాణికులు

డీవైసీసీ అధ్యక్షుడిగా మోహన్ నాయక్



మోహన్ నాయక్



అస్లామ్ ఖాన్



సందీప్ సామంతరాయ్



రమేష్ రావు

రాయగడ: జిల్లా యువజన కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా మోహన్ నాయక్ ఎన్నికయ్యారు. భారత జాతీయ కాంగ్రెస్ ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎన్నికలో మోహన్ నాయక్‌కు అనుకూలంగా 1600 ఓట్లు పోలయ్యాయి. అలాగే డీవైసీసీ ఉపాధ్యక్షుడిగా అస్లామ్ ఖాన్, రాయగడ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జోషఫ్ ఖోస్లా, ఉపాధ్యక్షుడిగా అశోక్ ఖోస్లా, గుణుపూర్ అసెంబ్లీకి అవినాష్ గమాంగొ, ఉపాధ్యక్షుడిగా భాస్కర్ జగరక, బిసంకటక్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బలదేవ్ శత్పతి, ఉపాధ్యక్షుడిగా కుసు కంధపాణి ఎన్నికైన నట్లు కొరాపుట్ లోక్‌సభ యువజన కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు భవానీ జెనా తెలిపారు.

కొరాపుట్ యూత్ కాంగ్రెస్‌లో..

జయపురం: కొరాపుట్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సందీప్ సామంతరాయ్ ఎన్నికయ్యారు. అలాగే జయపురం శాసనసభ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కె.రమేష్‌రావు గెలుపొందారు. మార్చిలో యూత్ కాంగ్రెస్ ఎన్నికలు జరపగా, ఫలితాలను బుధవారం ప్రకటించారు. ఇందులో డీవైసీసీ అధ్యక్షుడిగా సందీప్ సామంతరాయ్‌కు 3,298 ఓట్లు పోలయ్యాయి. రాజీవచంద్ర టిక్రిని ఉపాధ్యక్షుడిగా ప్రకటించారు. జయపురం అసెంబ్లీలో అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికలో కె.రమేష్ రావుకు 1516 ఓట్లు వచ్చాయి. రెండో స్థానంలో నిలచిన రామఖొర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైనట్లు పార్టీ వర్గాలు ప్రకటించారు. సాధారణ కార్యదర్శిగా సమిత్ పట్నాయక్ గెలుపొందారు. లక్ష్మీపూర్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడిగా మంఠి ఖొరా, కొరాపుట్ అధ్యక్షుడిగా బిశు ఖిలో, కొట్‌పాడ్ అధ్యక్షుడిగా సహిర్ హుస్సేన్, పొట్టంగి అసెంబ్లీ నుంచి జగదీష్ బాగ్ గెలుపొందారు.

5 క్వింటాళ్ల గంజాయి పట్టివేత

- 14మంది నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు
- మొత్తం సరుకు విలువ దాదాపు రూ.38 లక్షలు



చిత్రకొండ పోలీసుల అదుపులో నిందితులు, గంజాయి



రాయగడ: పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎక్సైజ్, ఆర్‌పీఎఫ్ సిబ్బంది

మల్కన్‌గిరి: వేర్వేరు జిల్లాల్లో పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది నిర్వహించిన దాడుల్లో 5 క్వింటాళ్లకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి 14మంది నిందితులను అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే... మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి పోలీసులు మంగళవారం రాత్రి ఎస్‌ఆర్ పరిశ్రమ కూడలి వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో బైక్‌పై బస్తాలతో వేగతంగా వెళ్తున్న వ్యక్తులను అడ్డుకున్నారు. వారిని అనుసరిస్తూ వచ్చిన మరో వాహనం కొద్ది దూరంలో ఆగి పోవడంతో అనుమానంతో వెంబడించి పట్టుకున్నారు. 2వాహనాల్లో 280కిలోల గంజాయి పట్టుబడింది. ఈ మేరకు నలుగురు నిందితులను అరెస్ట్ చేశబూరు. వారంతా కొరాపుట్ జిల్లా మాచ్‌ఖండ్ పోలీసు స్టేషన్ పరిధి సురమి గ్రామానికి చెందిన వెంకట్రావు నిరకీ, రంజన్ గడంగ, ఈశ్వర్ నిరాకీ, జయపురానికి చెందిన లలిత్ హరిజన్‌గా గుర్తిచారు. సరుకును జయపురం తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితులను బుధవారం ఉదయం మల్కన్‌గిరి కోర్టులో హాజరు పరిచారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.15 లక్షలు ఉంటుందని తెలిపారు.

ముగ్గురి అరెస్ట్..

రాయగడ: గజపతి జిల్లా మోహాన నుంచి పశ్చిమ బెంగాల్‌కు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్థానిక రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఎక్సైజ్, ఆర్‌పీఎఫ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో మోహానాకు చెందిన లక్ష్మీకాంత్ నాయక్(25), స్వయంబర్ నాయక్(32), పశ్చిమ బెంగాల్‌కు చెందిన మను సిన్హా(31)ను అరెస్ట్ చేశారు. వారి నుంచి 66.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి అభిరాం బెహరా వెల్లడించారు. తమ శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ గుప్తేశ్వర ప్రధాన్, సంజయ్‌కుమార్ ప్రధాన్, ఇన్‌స్పెక్టర్ సీమాకిరణ్ బెక్ ఆదేశాల మేరకు రాయగడ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో దాడులు నిర్వహించామన్నారు. ఈ క్రమంలోలక్ష్మీకాంత్ నుంచి 20.2 కిలోలు, స్వయంబర్ వద్ద 21కిలోలు, మను నుంచి 22.1 కిలోల గంజాయి పట్టుబడింది. స్వాధీనం చేసుకున్న సరుకు విలువ రూ.7 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. నిందితులను కోర్టులో హాజరు పరచడంతో పాటు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సరిహద్దుల మీదుగా..

బరంపురం: స్థానిక నగరానికి అక్రమంగా రవాణా చేస్తున్న 158కిలోల గంజాయిని సురడా, దిగపండి పోలీసులు స్వాధీనం చేసుకున్నామని ఐఐసీ జయరామ్ శత్పతి తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు దిగపండి పోలీసులు మార్గం మధ్యలో రెక్కీ నిర్వహించి, వచ్చిపోయే వాహనాలను సోదా చేశారు. అటుగా వస్తున్న కారులో 95కిలోల గంజాయి బయటపడింది. దీంతో డ్రైవర్‌తో సహా ఐదుగురిని అరెస్ట్ చేశారు. అలాగే గంజాం–గజపతి జిల్లాల సరిహద్దు తప్తాపాణి ఘాటీలో సురడా పోలీసులు ఆటోపై దాడులు నిర్వహించి, 65కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో గంజాం జిల్లాకు చెందిన మిహర్ నాయక్, జోషఫ్ నాయక్, సుమన్ నాయక్, తామస్ దిగల్, జగనాథ్ నాయక్, రంజన్ మహంతి లను నిందితులుగా గుర్తించి, అరెస్ట్ చేశారు. మొత్తం రూ.16 లక్షలు విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నామని పోలీసులు వెల్లడించారు.



బరంపురం: సీజ్ చేసిన గంజాయి, వాహనాలతో దిగపండి పోలీసులు

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో కార్మికుడి మృతి


వికాస్ మృతదేహం

పెనుకొండ: సత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలోని కియా అనుబంధ పరిశ్రమ నేషనల్ ఆటో ప్లాస్ట్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన వికాస్(27) బుధవారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. కొంతకాలంగా పెనుకొండలోని ఆల్విన్ కాలనీలో సోదరుడు రాజు, మరికొందరు కార్మికులతో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్న అతను.. నేషనల్ ఆటో ప్లాస్ట్ కంపెనీలో పని చేస్తున్నాడు. సాయంత్రం 4గంటల ప్రాంతంలో తన గదిలో గొంతు కోసిన స్థితిలో పడి కనిపించాడు. తీవ్ర రక్తస్రావమై అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో గమనించిన తోటి కార్మికులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి వైద్యులు రిఫర్ చేయడంతో బెంగళూర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. ఆత్మహత్య చేసుకున్నాడా? లేదంటే ఇతరత్రా ఏవైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో విచారణ చేస్తున్నామన్నారు.

కేకే లైన్‌లో వాల్తేర్ డీఆర్‌ఎం పర్యటన

- కొరాపుట్ రైల్వేస్టేషన్‌ను ఆధునీకరిస్తామని హామీ


మీడియాతో మాట్లాడుతున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

కొరాపుట్: కొత్తవలస-కిరండూల్(కేకే) రైల్వే లైన్‌ను వాల్తేర్ నూతన డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ పరిశీలించారు. ఈ మేరకు కొరాపుట్ రైల్వేస్టేషన్‌ను బుధవారం సందర్శించారు. అక్కడి రన్నింగ్ రూమ్, కార్యాలయ భవనాలు, సిబ్బంది విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వాల్తేర్ డీఆర్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం డివిజన్‌లో అత్యంత కీలకమైన కేకే లైన్‌ను తొలిసారిగా సందర్శించానని తెలిపారు. కొరాపుట్ రైల్వేస్టేషన్‌ను ఆధునీకరణ, అన్ని సదుపాయాలతో పాసింజర్ వెయిటింగ్ హాల్, డార్మిటరీ, రిట్రైరింగ్ రూమ్ నిర్మాణాలు చేపడతామన్నారు. జయపురం రైల్వేస్టేషన్‌లో పాసింజర్ వెయిటింగ్ హాల్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు ప్రత్యేక రైలులో ఛత్తీస్‌గఢ్ లోని కిరండూల్, బచేలి తదితర ఇనుప గనులు ఉన్న రైల్వే ప్రాంతాలను పరిశీలించారు. జాతీయ గనుల అభివృద్ధి సంస్థ(ఎన్‌ఎండీసీ) ఈ ప్రాంతం నుంచి ముడి ఇనుప రజను కేకే లైన్ ద్వారా విశాఖపట్నం తదితర ప్రాంతాలకు రవాణా చేస్తుందన్నారు. వాల్తేర్ డివిజన్‌కు ఇదే అధిక లాభాలను తీసుకు వస్తుందని వివరించారు. అలాగే డివిజనల్ వినియోగదారుల కమిటీ కొరాపుట్ పార్లమెంట్ ప్రతినిధి మనోజ్ ఆచార్య డీఆర్‌ఎంను కలిసి, కొరాపుట్ స్టేషన్ అభివృద్ధి చేయాలని విన్నవించారు.

వ్యక్తి అదృశ్యం

రామభద్రపురం: మండలంలోని తారాపురం గ్రామానికి చెందిన పొట్టంగి సన్యాసిరావు అదృశ్యమయ్యాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత నెల 29వ తేదీన అదే గ్రామానికి చెందిన 10 మంది గుడిసెల నేతకు హైదరాబాద్ వెళ్లారు. పనులు ముగించుకుని ఈ నెల 11వ తేదీన 9 మంది మాత్రమే తిరిగి గ్రామానికి చేరుకున్నారు.సన్యాసి రావు ఇంటికి రాలేదు. ఇప్పటి వరకు ఇంటికి రాకపోవడంతో గ్రామానికి చేరుకున్న 9 మందిని కుటుంబసభ్యులు వాకబు చేశారు. ఏమో తెలీదని, తామంతా ఎవరికి వారు విడివిడిగా వచ్చామని, సన్యాసిరావు ఎక్కడికి వెళ్లాడో తెలియదని చెప్పారు. అన్ని ప్రాంతాలలో ఉన్న చుట్టాలను అడగ్గా రాలేదని చెప్పడంతో ఆందోళన చెందిన భార్య తిరుపతమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

తాటిపూడి కాలువలో వృద్ధురాలి మృతదేహం

గంట్యాడ: మండలంలోని తాటిపూడి కాలువలో ఓ వృద్ధురాలి మృతదేహం బుధవారం కనిపించింది. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తాటిపూడి సాగునీటి కాలువలో సుమారు 65 సంవత్సరాల వయసు గల వృద్ధురాలి మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం మేరకు వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. అయితే మృతురాలి వివరాలేమీ తెలియరాలేదని ఎస్సై కిరణ్‌కుమార్‌నాయుడు తెలిపారు. ఆమె ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయిందా? ఆత్మహత్యకు పాల్పడిందా అనేది తెలియాల్సి ఉందన్నారు.

భలే బేరం..



గత వారం రోజులుగా నవరంగపూర్ జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురవడంతో పుట్ట గొడుగులు మార్కెట్‌లో ప్రత్యక్షమయ్యాయి. శ్రావణ మాసంలో వర్షాల సమయంలో ఇవి పుట్టుకు రావడంతో శ్రావణ పుట్ట గొడుగులుగా పిలుస్తారు. ప్రస్తుతం వీటి ధర కిలో రూ.వెయ్యి పలుకుతోంది. రుచికరంగా కూడా ఉండటంతో సాధారణంగానే కొనుగోలు చేసేందుకు జనం ఆసక్తి చూపిస్తారు. అయితే పెరిగిన నిత్యావసరాలు, కూరగాయల ధరలతో మధ్య తరగతి వార్గాలు కొనుగోలు చేసేందుకు వెనుకడుగు వేస్తున్నారు. – కొరాపుట్



ఆలయంలో అలుగు..

మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి గజియాగూడ గ్రామం వద్ద బుధవారం 7కిలోల అలుగును అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని శివాలయానికి బుధవారం ఉదయం దీపారాధనకు వచ్చిన అర్చకులు.. ఆవరణలో తిరుగాడుతున్న వన్యప్రాణిని చూసి భయపడిన చిత్రకొండ అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్టర్ మృత్యుంజయ శెఠి, సిబ్బంది అక్కడికి చేరుకొని, అలుగును స్వాధీనం చేసుకున్నారు. భారీ వర్షాల కారణంగా సమీపంలోని అడవి నుంచి వచ్చి ఉంటుందని భావిస్తున్నారు.

నిలువెత్తు నిర్లక్ష్యం..



అధికారుల నిర్లక్ష్యం వాహనదారులకు ప్రాణ సంకటంగా మారింది. భారీ వర్షాలు కురవడంతో నవరంగ్‌పూర్ జిల్లా జొరిగాం సమితి బొడటెమర పంచాయతీ సన్నటెమర-తారాబెడా గ్రామాల మధ్య జబాగుడ వద్ద రోడ్డుపై పెద్ద గొయ్యి ఏర్పడింది. సమస్యను వెంటనే అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ స్పందించ లేదని ప్రజలు వాపోతున్నారు. కనీసం హెచ్చరిక బోర్డు కూడ లేకపోవడంతో రాత్రి సమయాల్లో పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. దీంతో కొంతమంది రైతులు గొయ్యిలోఇలా ముళ్ల పొద ఏర్పాటు చేశారు. – కొరాపుట్

వేర్వేరు ప్రమాదాల్లో వ్యక్తి మృతి

- ఐదుగురుకి గాయాలు

జయపురం: స్థానిక సబ్ సవిజన్ పరిధిలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో యువకుడు మరణించగా కార్మికశాఖ అధికారితో సహా ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. బొరిగుమ్మ పోలీస్ స్టేషన్ పరిధి 26వ జాతీయ రహదారిలోని ఆదర్శ పాఠశాల సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న యువకుడు మృతిచెందాడు. బొరిగుమ్మ పోలీసు స్టేషన్ పరిధి చికిమా గ్రామానికి చెందవిన ధనపతి పూజారి(21)గా గుర్తించారు. సమాచారం అందిన వెంటనే బొరిగుమ్మ పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి, దర్యాప్తు చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. చికిమ గ్రామానికి చెందిన ధనపతి పూజారి బైక్‌పై మంగళవారం ఉదయం జయపురం వెళ్లాడు. అక్కడి నుంచి తన పొలంలో పని చేసేందుకు కొంతమంది మహిళలను పిలిచేందుకు బొరిగుమ్మ సమీపం నువాగుడ గ్రామానికి వెళ్తుండగా ఆదర్శ పాఠశాల సమీపంలో వెనుక నుంచి వస్తున్న ట్రక్కు బలంగా ఢీకొంది. దీంతో కింద పడి, తలకు తీవ్రంగా గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బొరిగుమ్మ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు. అలాగే జయపురం సదర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లా కార్మికశాఖ అధికారి తీవ్రంగా గాయపడ్డారు. కుంద్రాలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో పాల్గొనేందుకు కార్మికశాఖ కార్యాలయ సిబ్బంది కారులో వెళ్తుండగా కుంద్రా-కలియగాం మార్గంలో ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వాహనం ముందు సీట్లో కూర్చున్న ఆయనతో పాటు డ్రైవర్, వెనుక కూర్చున్న కల్యాణ సింగపూర్ కో-ఆర్డినేటర్ చిన్మయ రౌత్రాయ్ తీవ్రంగా, సహాయ లేబర్ అధికారి చైతన్యప్రసాద్ మాఝి, బులు శ్రీహరియ స్వల్పంగా గాయపడ్డారు. గాయపడిన వారందరినీ జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేర్చారు. ఘటనపై సదర్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఐఐసీ ఈశ్వర తండి వెల్లడించారు.


బొరిగుమ్మలో మృతిచెందిన ధనపతి పూజారి

బీజేడీ యువనేతపై దుండగుల కాల్పులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సోమ్‌నాథ్ సాహు

భువనేశ్వర్: పూరీ నగరంలోని రెడ్‌క్రాస్ రోడ్డులో గుర్తు తెలియని దుండగులు జరిపిన కాల్పుల్లో ఓ వ్యాపారి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు సోమ్‌నాథ్ సాహు అధికార బీజేడీ యువ నాయకుడిగా గుర్తించారు. బుధవారం ఉదయం తన గోదాంకు వెళ్లిన సోమ్‌నాథ్‌పై గుర్తు తెలియని నలుగురు దుండగులు దాడి చేసి, కాల్పులు జరిపారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతనిని స్థానికుల సాయంతో హుటాహుటిన చికిత్స కోసం ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దుండగులు ఘటనా స్థలం నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, విచారణ చేపట్టారు. పరారీలో ఉన్న దుండగులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామని, విచారణలో భాగంగా ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నామని పూరీ జిల్లా అదనపు పోలీసు సూపరింటెండెంట్ సుశీల్ మిశ్రా తెలిపారు. ప్రత్యక్ష సాక్షులు, స్థానిక నివాసితులను ప్రశ్నిస్తున్నారు. సైంటిఫిక్ బృందం ఘటనా స్థలం పరిసరాలను పరిశీలిస్తోంది.

పంట కాలువలో పడి యువకుడి మృతి


నీటిలో తేలియాడుతున్న ఉగ్ర మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖొయిర్‌పుట్ సమితి రసబేడ పంచాయతీ ముదిలిగూడ గ్రామంలో ఉన్న పంట కాలువలో ప్రమాదావశాతు జారిపడి ఓ యువకుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఉగ్ర మాఢి(32) మంగళవారం మధ్యాహ్నం తన పొలానికి వెళ్లి, చీకటి పడినా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు బుధవారం ఉదయం వెతికి చూడగా, పొలంలోని పంట కాలువలో శవమై కనపించాడు. దీనిపై ఖొయిర్‌పుట్ పోలీసులకు సమాచారం అందించగా, ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం కుడుములగుమ్మ ఆరోగ్య కేంద్రానికి తరలించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మంగళవారం సాయంత్రం ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో ప్రమాదావశాత్తు జారిపడినట్లు భావిస్తున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

డీపీఆర్ సర్వే ప్రారంభం

- మజ్జిగౌరి మందిరం అభివృద్ధి పనులకు సన్నాహాలు


సర్వే చేస్తున్న ఇంజినీరింగ్ సంస్థకు చెందిన బృందం

రాయగడ: ఆంధ్ర, ఒడిశా ప్రజల ఆరాధ్యదైవం మజ్జిగౌరి మందిరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రప్రభుత్వం అనుమతిచ్చిన నేపథ్యంలో దీనికి సంబంధించిన డిటైల్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్) సర్వే పనులు ప్రారంభమయ్యాయి. భువనేశ్వర్‌కు చెందిన అంకిత్‌రాజ్ కన్సల్టెన్సీ ప్రైవేట్ సంస్థ ఈ మేరకు ప్రాజెక్టు సర్వే పనులకు శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది జూన్ 7న రాష్ట్ర 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్ రాయగడ పర్యటనలో భాగంగా అమ్మవారి మందిరం అభివృద్ధికి తగిన నిధులు సమకూరుస్తామని, సమగ్ర డీపీఆర్ సమర్పించాలని ఆదేశించారు. దీనికి అనుగుణంగా భువనేశ్వర్‌కు చెందిన ఇంజినీరింగ్ సంస్థ సర్వేయర్ నవ నాయక్, అసిస్టెంట్ అంకిత్‌రాజ్, మందిరం జేఈఎం వెంకట్రావు డీపీఆర్ సర్వే పనులను బుధవారం ప్రారంభించారు. ఇదిలా ఉండగా ఇప్పటివరకు అమ్మవారి మందిరం ప్రాంగణంలో స్థలం రైల్వే శా కు సంబంధించినది కావడంతో అభివృద్ధికి నోచుకోలేక పోయింది. ప్రతి ఆది, మంగళ, బుధవారాల్లో ఒడిశాతో పాటు పొరుగు రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం రైల్వేశాఖతో నిర్వహించిన చర్చల ఫలితంగా రైల్వేశాఖకు సంబంధించిన 6.30 ఎకరాల స్థలాన్ని మందిరానికి కేటాయించారు. ఈ స్థలంలో భక్తులకు సకల సౌకర్యాలను కల్పించేందుకు మాస్టర్ ప్లాన్‌తో అభివృద్ధి చేయనున్నారు. దీనికి సంబంధించిన నిధులను ప్రభుత్వం సమకూర్చనున్న నేపథ్యంలో డీపీఆర్ పనులు త్వరితగతిన పూర్తయితే భక్తులు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఆస్కారం ఏర్పడుతుంది.

రైలు ఢీకొని వ్యక్తి మృతి


మృతిచెందిన వ్యక్తి అప్పల స్వామి (ఫైల్)

బాడంగి: మండలంలోని డొంకినవలస స్టేషన్‌లో రైలు ఢీకొని మంగళవారం రాత్రి ఓ వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. బహిర్భూమికి వెళ్లేందుకు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొందని మృతుడిని రైల్వే కాలనీలో నివాసముంటున్న సిరిసెట్టి అప్పలస్వామి(31)గా గుర్తించి నట్లు చెప్పారు. అప్పలస్వామి వంటలమేస్త్రీగా పనిచేస్తుంటాడని, ఆయనకు భార్య భూలక్ష్మి, ఇద్దరు పిల్లలున్నారని తెలిపారు. స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు బొబ్బిలి రైల్వే హెచ్‌సీ కృష్ణారావు, సిబ్బంది బుధవారం హాజరై కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకి తరలించారని, పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించామని తెలిపారు.

గాయపడిన వ్యక్తి..

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలి వద్ద టీడీపీ ర్యాలీకి వెళ్లి వస్తూ ట్రాక్టర్ ఢీకొని గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు.ఈనెల 11వ తేదీన చింతలబెలగాం గ్రామానికి చెందిన మఠ్రాపు శ్రీనివాసరావు, ఎం.తిరుపతిరావులు టీవీఎస్ ఎక్సెల్‌పై టీడీపీ ర్యాలీకి వెళ్లి వస్తుండగా ట్రాక్టర్ ఢీకొని గాయపడిన సంగతి విదితమే. మఠ్రాపు శ్రీనివాసరావుకు తీవ్రగాయాలు కాగా విశాఖపట్నంలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

జోరు వాన

- పార్వతీపురం మన్యం జిల్లాలో విస్తారంగా వర్షాలు
- రిజర్వాయర్లకు జలకళ
- నదులకు వరదనీటి తాకిడి
- నిండుకుండలా చెరువులు
- తోటపల్లి కాలువకు గండి

పార్వతీపురం:

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా బుధవారం వర్షాలు కురిశాయి. కొన్నిచోట్ల కుండపోత వర్షం కురిసింది. గత మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు నదులు, వాగుల్లో వరదనీటి ప్రవాహం పెరిగింది. జలాశయాలు, కొన్ని చెరువులు నిండుకుండలా మారాయి. లోతట్టు ప్రాంతాలను వర్షపునీరు ముంచెత్తింది. మరో నాలుగు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. సహాయక చర్యల్లో నిమగ్నమైంది. ఉభాలు సమయంలో వర్షాలు అనుకూలించడంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఈ ఏడాది సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని చెబుతున్నారు. జిల్లాలో 115.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.


సంతకవిటి: వర్షపు నీటితో నాగావళి నది నిండుగా ప్రవహిస్తోంది. నారాయణపురం ఆనకట్టలోకి బుధవారం 5వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరగా, అంతే సామర్థ్యంలో వరదనీరు కిందకు ప్రవహిస్తోందని జల వనరుల శాఖాధికారులు తెలిపారు.

జిల్లాలో బుధవారం నమోదైన వర్షపాతం (మిల్లీమీటర్లలో)

మండలం	వర్షపాతం
వీరఘట్టం	7.8
సీతంపేట	10.2
భామిని	4.2
పాలకొండ	12.2
కొమరాడ	7.6
గుమ్మలక్ష్మీపురం	2.4
కురుపాం	4.2
జియ్యమ్మలస	12.8
గరుగుబిల్లి	23
పార్వతీపురం	5.2
మక్కువ	0.6
సీతానగరం	7.2
బలిజిపేట	14.2
సాలూరు	2.8
పాచిపెంట	0.8

నిలకడగా తోటపల్లి



తోటపల్లి కుడిప్రధాన కాలువ ద్వారా సరఫరా అవుతున్న సాగునీరు

గరుగుబిల్లి: అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టు వద్ద నీటిప్రవాహం నిలకడగా ఉంది. నాగావళినదిలో తోటపల్లి ప్రాజెక్టువద్ద బుధవారం సాయంత్రం 6 గంటలకు 105 మీటర్ల లెవిల్‌కు గాను 103.65 మీటర్ల లెవిల్‌లో నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం నది పైభాగం నుంచి ప్రాజెక్టుకు 3,180 క్యూసెక్కుల నీరువస్తుండగా, అధికారులు ఒక గేటును ఎత్తివేసి 2,777 క్యూసెక్కుల నీటిని నదిలోకి తిరిగి విడిచిపెడుతున్నారు. ప్రాజెక్టు నీటిసామర్థ్యం 2.5 టిఎంసీలకు గాను 1.704 టీఎంసీలు నిల్వ ఉన్నట్టు ఏఈ కిశోర్ తెలిపారు.

మళ్లీ అక్కడే గండి


తోటపల్లి కాలువకు గండి

రెండు నెలల కిందట గండిపడిన తోటపల్లి కాలువకు మళ్లీ బుధవారం తెల్లవారు జామున ఆ ప్రాంతంలోనే గండి పడింది. బొబ్బిలి రాజాం రోడ్డు పక్కనే గల అలజంగి చెట్టు సమీపంలో 31.625 కిమీ వద్ద గండి పడింది. గతంలో ఎలుకల కన్నాలు పెద్దవై పడిన గండికి 700 మీటర్ల దూరంలో ఇప్పుడు కొత్తగా గండి పడింది. ఇది లైనింగ్ గోడకు కన్నం పడటం వలన ఏర్పడిన గండి కావడంతో గట్టుకు పెద్దగా నష్టం లేకపోయినా లైనింగ్‌కు ఏర్పడిన సాగునీరు వృథాగా పోతోంది. దీంతో 900 క్యూసెక్కుల నుంచి 600 క్యూసెక్కులకు నీటి ప్రవాహాన్ని తగ్గించారు. గండివల్ల సుమారు 50 ఎకరాల వరినాట్లు మునిగినట్టు రైతులు తెలిపారు. జలవనరుల శాఖ డీఈఈ కుమార్, ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు, తదితరులు గండి ప్రాంతాన్ని పరిశీలించారు. రైతులను ఆదుకుంటామని చెప్పారు. గండని వెంటనే పూడ్చుతామని తెలిపారు.


వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు వద్ద నీటి నిల్వ


రైతులు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

ప్రాజెక్టుల్లో పెరిగిన నీటిమట్టం

బొబ్బిలి: అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు జలశయాల్లో నీటిమట్టం పెరిగింది. ఇప్పటికే ఖరీఫ్ సాగుకు ఇంచుమించుగా అన్ని ప్రాజెక్టుల నుంచి అధికారులు సాగునీటిని విడిచిపెట్టారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో సాగునీటికి చింత ఉండదని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ప్రాజెక్టుల సాగునీటి మట్టం(మీటర్లలో) ఇలా..

ప్రాజెక్టు	పూర్తి నీటిమట్టం	ప్రస్తుత నీటిమట్టం
తోటపల్లి	105.00	103.64
జంఝావతి	డైవర్షన్	123.65
పెదంకలాం	డైవర్షన్	
వట్టిగెడ్డ	121.62	117.23
పెద్దగెడ్డ	213.80	212.80
వీఆర్‌ఎస్	161.00	158.40


పార్వతీపురంలో కురుస్తున్న వర్షం

గండి ప్రాంతం పరిశీలన


భాసూరు వద్ద తోటపల్లి పిల్లకాలువకు పడిన గండి

పాలకొండ రూరల్: తోటపల్లి ఎడమ కాలువకు అనుసంధానంగా ఉన్న పిల్లకాలువకు పాలకొండ మండలం భాసూరు గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి గండి పడింది. దీంతో వర్షపునీరు సమీప పంట పొలాల్లోకి చేరింది. విషయాన్ని సర్పంచ్ గురునాయుడు ఇరిగేషన్ అధికారులకు తెలిపారు. తక్షణమే స్పందించిన ఆ శాఖ ఏఈ బి.శంకరరావు, సిబ్బంది గండి పడిన ప్రాంతాన్ని సందర్శించారు. తాజా పరిస్థితి ఉన్నతాధికారులకు నివేదించారు. యుద్ధప్రాతిపదికన పరిష్కారం చర్యలపై దృష్టి పెట్టారు.

క్లుప్తంగా

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో మహిళలకు ఉచితంగా 30 రోజుల టైలరింగ్ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విషయాన్ని సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. 19 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు ఉండి, చదవటం, రాయటం తెలిసిన వారు ఆగస్టు నాలుగో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఐదో తేదీ నుంచి శిక్షణ ప్రారంభించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 95534 10809, 79933 40407 నంబర్లను సంప్రదించాలి.

వర్షాలకు కూలిన గోడ

సారవకోట: బుడితి గ్రామంలోని గొడగల వీధికి చెందిన ముంజేటి సింహాచలం ఇంటి గోడ వర్షాలకు బుధవారం కూలి పోయింది. నాలుగు రోజుల నుంచి వర్షాలు ఎడతెరిపి లేకుండా కురవడంతో గోడ నానిపోయి కూలి పోయినట్లు బాధితుడు తెలిపాడు. గోడ కూలిన సమయంలో ఎవ్వరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది.

కొండచిలువ హతం


స్థానికుల చేతిలో హతమైన కొండచిలువ

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి బెల్లుపడ గ్రామంలో భారీ కొండచిలువ బుధవారం హల్‌చల్ చేసింది. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు త్రినాథపేట కాలనీ సమీపంలోని కొండపై నుంచి సుమారు ఏడడుగుల కొండచిలువ బెల్లుపడ గ్రామంలోకి చొరబడింది. ఓ ఇంట్లోకి వెళ్లిన కొండచిలువ అక్కడ ఉన్న కోళ్లను మిగేందుకు ప్రయత్నించగా.. అవి అరవడంతో ఇంట్లో ఉన్నవారు వచ్చి చూడగా కొండచిలువ కనిపించడంతో తీవ్ర భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న కొంతమంది ధైర్యం చేసి అక్కడ నుంచి కొండచిలువను తరిమేసేందుకు ప్రయత్నించగా వారిపై తిరగబడడంతో చేసేదిలేక కర్రలతో కొట్టి హతమార్చారు.

నేడు కిసాన్ సమృద్ధి కేంద్రాల ఏర్పాటు

శ్రీకాకుళం న్యూకాలనీ: దేశవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న కిసాన్ సమృద్ధి కేంద్రాలను జిల్లా వ్యాప్తంగా గురువారం ప్రారంభిస్తున్నట్లు బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతు సమ్మాన్ నిధిని దేశప్రధాని నరేంద్రమోదీ గురువారం రైతు ఖాతాల్లో జమ చేస్తారన్నారు. శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా 144 రైతు సమృద్ధి కేంద్రాలు తొలి విడతగా గుర్తింపబడ్డాయన్నారు. ఇకపై అయా కేంద్రాల్లో రైతుకు సంబంధించిన అన్ని పనిముట్లు ఒకే వేదిక ద్వారా రైతుకు అందించడం కిసాన్ సమృద్ధి కేంద్రాల ప్రధాన ఉద్దేశమన్నారు. శ్రీకాకుళంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

ఒకటిన సామూహిక సత్యనారాయణ వ్రతాలు

ఎచ్చెర్ల క్యాంపస్: చిన్నకొంగరాం గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆగస్టు ఒకటో తేదీన సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం ఆర్గనైజర్ ఎం.లలితకుమారి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రామంలోని రామాలయంలో ఆ రోజు ఉదయం తొమ్మిది గంటలకు వ్రతాలు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి ఉన్న దంపతులు పూజా సామగ్రితో హాజరు కావాలని, సంప్రదాయ దుస్తులు ధరించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98669 14160, 95537 45950 నంబర్లను సంప్రదించాలి.

వేధిస్తున్నారని ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్: తన భర్త కట్నం కోసం వేధిస్తున్నారని శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోకి చెందిన మహిళ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ బలివాడ గణేష్ బుధవారం తెలిపారు. విశాఖపట్నం ఎన్టీపీసీఎస్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న తన భర్తకు ఇది వరకే వివాహమైందని.. ఆ విషయాన్ని దాచిపెట్టి తనను పెళ్లి చేసుకోవడమేకాకుండా.. కట్నం తెమ్మంటూ మానసిక వేదనకు గురిచేస్తున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేడు వర్సిటీలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ నెల27, 31వ తేదీల్లో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ తెలిపారు. వర్సిటీలో బుధవారం వివరాలు వెల్లడించారు. గురువారం ఏట్రోడ్ సంస్థ ఇంటర్వ్యూలు నిర్వహిస్తుందని, ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్ కేంద్రంగా పనిచేయాల్సి ఉంటుందని, సీఎస్ఈ, ఈసీఐ, ఎంసీఏ పూర్తిచేసిన వారు అర్హులని వివరించారు. 31న ఏప్రోనిక్స్ సంస్థ నిర్వహించే ఇంటర్వ్యూలకు డిప్లమా, ఇంజినీరింగ్, బీఎస్సీ పూర్తిచేసిన వారు అర్హులని, ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి గల వారు వర్సిటీ ప్లేస్‌మెంట్ అధికారి కె.విద్యాసాగర్ (9848819969)ను సంప్రదించాలని సూచించారు.

ఉద్దానం జీవధార సిద్ధం



ప్రాజెక్ట్ ద్వారా నీరు ప్యూరిఫైడ్ అవుతున్న దృశ్యం (ఇన్‌సెట్లో) మెళియాపుట్టిలో మెగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డిశాంతి, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

ఉద్దానం.. పుడమికి పచ్చని వడ్డాణం.
కానీ.. ఈ సుందర సీమ హృదయంలో అంతులేని కన్నీటి కాసారం.
కిడ్నీ వ్యాధి రూపంలో వేధిస్తున్న విషాదం.
అయితే ప్రతి వేదనకూ ఓ ఉపశమనం ఉంటుంది.
ఉద్దానానికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూపంలో సాంత్వన దక్కేందుకు రంగం సిద్ధమైంది.
ఉత్కళాంధ్రకు వరమైన వంశధార.. అమృతధారలా మారి ఉద్దానం గొంతు తడపనుంది.
రూ.700 కోట్ల వ్యయంతో నిర్మించిన మంచినీటి ప్రాజెక్ట్ దాదాపు సిద్ధమైంది. దీనికి సంబంధించి బుధవారం నిర్వహించిన ట్రైల్ రన్ సక్సెస్ అయింది.

- సమగ్ర మంచినీటి పథకం ప్రాజెక్టు ట్రైల్ రన్
- తాగు, సాగునీటికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం: మంత్రి సీదిరి
- కార్యక్రమానికి హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు

హిరమండలం/మెళియాపుట్టి: జిల్లాలో తాగు, సాగునీటికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సమ ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. బుధవారం హిరమండలంలోని వంశధార రిజర్వాయర్ వద్ద ఉద్దానం సమగ్ర మంచినీటి పథకానికి(మెగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు)సంబంధించి ట్రయల్ రన్ చేపట్టారు. మంత్రితో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఎమ్మెల్సీ నర్తు రామారావులు పాల్గొని ప్రాజెక్టు పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వంశధార రిజర్వాయర్ అపర భగీరథగా నిలుస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్దానం సమగ్ర మంచినీటి పథకానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. కరోనా నేపథ్యంలో పనుల్లో జాప్యం ఏర్పడిందని, లేకుంటే ఈ పాటికే పూర్తి అయ్యేదన్నారు. కొండలు, నదులు దాటి పైపులైన్ ఏర్పాటు గొప్ప విషయమన్నారు. ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం నియోజకవర్గాల ప్రజల దాహార్తి తీర్చేందుకు దాదాపు రూ.700 కోట్లు ఖర్చు చేసిన సీఎం జగన్ రుణం తీర్చుకోలేనిదన్నారు. దాదాపు 200 కిలోమీటర్ల మేర వంశధార జలాలను తీసుకువెళ్లే అద్భుతమైన ప్రాజెక్టుగా అభివర్ణించారు. మొత్తం 1040 కిలోమీటర్ల మేర పైపులై న్లు ఏర్పాటు చేయడం భగీరథ ప్రయత్నమని పేర్కొన్నారు. త్వరలోనే జాతికి అంకితం చేస్తామన్నారు. జిల్లా ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని కోరారు. అనంతరం మెళియాపుట్టిలోని మెగావాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. ఉద్దానం కిడ్నీ వ్యాధులు ప్రబలకుండా మెగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు నిర్మించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. హిరమండలం నుంచి ఇచ్ఛాపురం వరకు నీటిని అందించాలనే ఆలోచన రావడం అద్భుతమని, వెంటనే నిధులు మంజూరు చేసిన గొప్ప నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ జగనన్న మేధాశక్తితో ఆలోచించి, ఎంతోమంది శాస్త్రవేత్తలతో చర్చలు జరిపి ప్రాజెక్ట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. ఉద్దానంతో పాటు పాతపట్నం నియోజకవర్గంలో ఐదు మండలాలకు ఇంటింటికీ తాగునీరు అందించడం ఆనందంగా ఉందన్నారు. ఇప్పటికే 2.5 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, డీఈ ఆశాలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాస్‌ప్రసాద్, ఈఈ జి.జాన్‌బర్దన్, డీఈఈ జి.మధుసూదనరావు, తహశీల్దార్ మురళీమోహన్, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మీసాల రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎ.వి.సురేష్, అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


హిరమండలంలో ఉద్దానం ప్రాజెక్టు ఇన్‌టెక్ వెల్ వద్ద ట్రైల్ రన్ బటన్ నొక్కి ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

వదలని వాన


శ్రీకాకుళంలో జలమయమైన రోడ్డు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో బుధవారం వర్షం దంచికొట్టింది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పలుచోట్ల నగరంలో రోడ్లు జలమయమయ్యాయి. ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు పలు లోతట్టు ప్రాంతాలు నీటము నిగాయి. జిల్లా వ్యాప్తంగా 1016.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా గార మండలంలో 76.2 మి.మీ., అత్యల్పంగా కొత్తూరులో 8.4 మి.మీ.వర్షపాతం నమోదైంది.

వర్షపాతం మి.మీ.లలో

గారలో	76.2	ఎచ్చెర్ల	46.4	శ్రీకాకుళం	46.8
ఎల్ఎన్‌పేట	11.4	లావేరు	47.2	రణస్థలం	53.8
కోటబొమ్మాళి	40.0	మెళియాపుట్టి	14.2	సారవకోట	8.6
సరుబుజ్జిలి	20.8	పలాస	50.2	జలుమూరు	25.2
సంతబొమ్మాళి	38.2	పోలాకి	41.6	హిరమండలం	8.6
కంచిలి	54.2	ఇచ్ఛాపురం	12.8	నరసన్నపేట	38
పాతపట్నం	11.2	మందస	42	వజ్రపుకొత్తూరు	35.2
పొందూరు	50.2	ఆమదాలవలస	26	బూర్జ	18.4
కవిటి	27.4	సోంపేట	70.4	టెక్కలి	27.2
జి.సిగడాం	40.2	నందిగాం	25.6	కొత్తూరు	8.4


నరసన్నపేట: శివనగర్ కాలనీలో రోడ్డుపై చేరిన నీరు


సరుబుజ్జిలి: ముంపుబారిన తురకపేట భూములు


ఎచ్చెర్ల క్యాంపస్: జరజాం సమీపంలో ఫ్లై ఓవర్ వంతెన కింద చేరిన నీరు


నీటితో నిండిన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ

మణిపూర్‌లో మారణహోమం అరికట్టాలి


కాశీబుగ్గలో నిరసన తెలుపుతున్న ఆదివాసీ విద్యార్థులు

కాశీబుగ్గ: మణిపూర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న మారణహోమాన్ని అరికట్టాలని, మహిళలపై అత్యాచారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో నిరసన ర్యాలీ చేపట్టారు. రాష్ట్రాన్ని కాపాడలేని ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ చేశారు. కార్యక్రమంలో సవర జగన్నాయకులు, ఏఐఏఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.ఈశ్వరరావు, పలాస మండల శాఖ అధ్యక్షుడు సవర విజయ్, ఆదివాసీ వికాస పరిషత్, మందస కార్యవర్గ సభ్యులు, పలాస గవర్నమెంట్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మదన్‌మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

28న జీడి కార్మికుల సత్యాగ్రహ దీక్ష

కాశీబుగ్గ: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 28వ తేదీన ఉదయం పది గంటల నుంచి కాశీబుగ్గ బస్టాండ్ దారి గాంధీ విగ్రహం ఎదుట జీడి కార్మికులు 24 గంటల సత్యాగ్రహ దీక్ష చేపట్టనున్నారు. ఈ విషయాన్ని జీడి రైతు సంఘం ప్రతినిధులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ జీడి రైతు సంఘం కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ సమక్షంలో చేపట్టనున్న దీక్షకు అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు.

చెన్నైలో మత్స్యకారుడు అనుమానాస్పద మృతి


కోనేరు లోహిదాస్ (ఫైల్)

సోంపేట: మండలంలోని ఇస్కలపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారుడు కోనేరు లోహిదాస్ (35) చెన్నైలో అనుమానాస్పదస్థితిలో ప్రాణాలు కోల్పోయాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటా చేపల వేట నిషేధ సమయమైన మే నెలలో లోహిదాస్ చెన్నైకు వేట కోసం వెళ్తుంటాడు. ఈ ఏడాది కూడా అక్కడకు వెళ్లి చేపల వేట చేసుకుంటా వచ్చే ఆదాయంతో జీవనాధారం పొందుతున్నాడు. కాగా బుధవారం తెల్లవారుజామున చెన్నైలోని ఓ కాలువలో శవమై కనిపించాడు. మృతుని వద్ద ఉన్న ఆధార్ కార్డ్, సెల్ ఫోన్ ఆధారంగా లోహిదాస్‌గా అక్కడ పోలీసులు, తోటి మత్స్యకారులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. లోహిదాస్‌ది సహజ మరణం కాదని హత్యని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. హత్యా కోణంలోనే దర్యాప్తు చేపట్టాలని అక్కడి పోలీసులను కోరుతున్నారు. లోహిదాస్‌కు తల్లి కామమ్మ, భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇంటి పెద్ద మృతితో కన్నీరుమున్నీరుగా రోదించారు. ఒకే రోజు వ్యవధిలో గ్రామానికి చెందిన ఇద్దరు మత్స్యకారులు మృతి చెందడంతో ఇస్కలపాలెంలో విషాదాయలు అలుముకున్నాయి.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి


విత్తనాలను ప్యాక్ చేస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలని ప్రకృతి వ్యవసాయం ఎస్‌డీఏ సీహెచ్ సూర్యనారాయణ అన్నారు. ఇందులో భాగంగా వివిధ కూరగాయల విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రకృతి వ్యవసాయ శాఖ ప్రాజెక్ట్ మేనేజర్ రేవతి ఆధ్వర్యంలో 360 రోజులు పంటలు వచ్చే విధంగా ప్రకృతి వ్యవసాయం చేపట్టడం జరుగుతుందన్నారు. కేశవరావుపేట గ్రామంలో సేకరించిన విత్తనాలను ప్యాకెట్లుగా తయారు చేసి రైతులకు సరఫరా చేస్తున్నామన్నారు.

సొగసుల సిరికాకుళం


- శ్రీకాకుళం నగరం సుందరీకరణపై ప్రత్యేక దృష్టి
- కోట్లాది రూపాయలతో పార్కుల అభివృద్ధి
- ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న కుడ్య చిత్రాలు
- ఎవెన్యూ ప్లాంటేషన్, స్మార్ట్ స్ట్రీట్ రోడ్డులతో ఆహ్లాదకర వాతావరణం


శ్రీకాకుళం శాంతినగర్ కాలనీలో రూ. కోటితో అభివృద్ధి చేసిన నాగావళి రివర్ వ్యూ పార్కు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: సిక్కోలు సరికొత్త రూపును సంతరించుకుంటోంది. నగరాన్ని ఆహ్లాదకరంగా, సుందరంగా, అందరికీ నివాసయోగ్యంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రూ.7.25 కోట్లు నగర సుందరీకరణకు వెచ్చించింది.

పార్కుల ఆధునీకీకరణ..

సాయంత్రమైతే నగర ప్రజలు సేద తీరేందుకు, ఉదయం వాకింగ్ చేసేందుకు, పిల్లల ఆట విడుపు కోసం నగరంలోని ఆరు పార్కులపై ప్రత్యేక దృష్టి సారించారు. అందులో రూ.3.70 కోట్లతో గ్రీనరీతో కూడిన అభివృద్ధి చేశారు. శాంతినగర్‌లోని గాంధీ మందిరం పార్కును రూ.40 లక్షలు, శాంతినగర్ కాలనీలోని నాగావళి రివర్ వ్యూ పార్కును రూ.కోటి, కొత్తపేటలోని చల్లా నర్సింహం మున్సిపల్ పార్కును రూ.60లక్షలు, బాపూజీ కళామందిర్‌లో వద్ద గాంధీ పార్కును రూ.40లక్షలు, అఫీషియల్ కాలనీలోని డాక్టర్ అబ్దుల్ కలామ్ పార్కును రూ.40 లక్షలు, న్యూకాలనీలోని డైమండ్ పార్కును రూ.30 లక్షలు, పీఎన్ కాలనీ పార్కును రూ.60 లక్షలతో సుందరీకరణతో కూడిన అభివృద్ధి చేశారు. కాంపౌండ్స్, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్స్ తదితర వసతులు, సౌకర్యాలు సమకూర్చారు. వీటితో పాటు విజయాదిత్య పార్కును ఆధునీకరించేందుకు రూ.2.20 కోట్ల నిధులు కేటాయించారు. ఇక్కడ త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి.


రూ. 60లక్షలతో కొత్తపేటలో అభివృద్ధి చేసిన చల్లా నర్సింహం మున్సిపల్ పార్కు

కుడ్య చిత్రాలు అదరహో..

నగరాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దే క్రమంలో జిల్లా సంస్కృతి ప్రతిబింబించేలా 33 ప్రదేశాల్లో కుడ్య చిత్రాలు(మ్యూరల్ పెయింటింగ్స్)ను వేశారు. ప్రభుత్వ కార్యాలయాల కాంపౌండ్ వాల్స్, మూడు ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు, నాలుగు వంతెనలు, సెంట్రల్ డివైడర్లు, కళాశాలలు, స్కూల్స్ కాంపౌండ్ వాల్స్‌కు ఆయా ప్రాంత విశిష్టతలతో పాటు పిల్లలను అలరించే చిత్రాలు ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా అరసవిల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం దేవాలయాలు, వంశధార, నాగావళి నదుల ప్రాధాన్యతను తెలియజేసేలా పెయింటింగ్స్‌తో తీర్చిదిద్దారు. ఇందుకు రూ.75లక్షలు ఖర్చు చేశారు.


కొత్తరోడ్డు ఫ్లై ఓవర్ కింద వేసిన మ్యూరల్ పెయింటింగ్స్

అరసవిల్లిలో ఆధునీకీకరణ..

అరసవిల్లి దేవస్థానంలో రూ.35లక్షలతో భక్తుల రక్షణ కోసం జింక్ రేకు షెడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టారు. మరో 5.87 కోట్లతో ఇంద్ర పుష్కరిణి ఆధునీకరణ పనులు చేపట్టేందుకు ఆగస్టు మొదటి వారంలో శంకుస్థాపన చేయనున్నారు. వీటికి సంబంధించి ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి.

రూ.1.68 కోట్లతో ఎవెన్యూ ప్లాంటేషన్..


పాత్రునివలస టిడ్కో కాలనీలో ఎవెన్యూ ప్లాంటేషన్

నగరమంతా పచ్చదనం కన్పించేలా, ప్రజలకు మంచి వాతావరణం ఉండేలా రూ.కోటీ 68లక్షలతో హరిత నగరాల కింద శ్రీకాకుళం నగరంలోని 18 ప్రాంతాల్లో ఎవెన్యూ ప్లాంటేషన్(మొక్కలు) నాటారు. రోడ్డుకు ఇరువైపులా, కొన్ని చోట్ల రోడ్ల మధ్యన మొక్కలు పెంచుతున్నారు. పాత్రునివలసలో కొత్తగా నిర్మించిన టిడ్కో ఇళ్ల కాలనీలో కూడా పచ్చదనం కోసం మొక్కలు నాటారు.

రూ.1.40 కోట్లతో స్మార్ట్ స్ట్రీట్ రోడ్డు..


కలెక్టరేట్ నుంచి కొత్తపేట వరకు రూ. కోటి 40లక్షలతో అభివృద్ధి చేసిన స్మార్ట్ స్ట్రీట్ రోడ్డు

కలెక్టరేట్ నుంచి కొత్తపేట వరకు మోడల్ రోడ్డు పేరిట రూ.కోటి 40 లక్షలతో స్మార్ట్ స్ట్రీట్ రోడ్డు నిర్మించారు. ఆ రోడ్డుకు ఇరువైపులా గ్రీనరీతో పాటు మ్యూరల్ పెయింటింగ్స్‌తో అందంగా తీర్చిదిద్దారు. అక్కడే రోడ్డుకు ఆనుకుని ఉన్న చిన్న పార్కును కూడా అభివృద్ధి చేశారు.

మరో రూ.10.50 కోట్లతో నగరంలో బీటీ రోడ్లు..

ఆర్‌అండ్‌బీ పరిధిలోకి రాని నగరంలోని మిగతా రోడ్లను అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే రూ.10.50 కోట్లతో మంజూరయ్యాయి. 37ప్రాంతాల్లో బీటీ రోడ్లు వేసేందుకు ఈ నిధులు ఖర్చు చేయనున్నారు. వీటి టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. ఇవి పూర్తయితే వీధులు మరింత అందంగా కన్పించడమే కాకుండా రహదారి సమస్య తీరడంతో పాటు డ్రైనేజీ సమస్యకు పరిష్కారం దొరకనుంది.

'పచ్చ'ందాల సిక్కోలు మా లక్ష్యం..



నగరాన్ని అందంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పార్కుల ఆధునికీకరణతో పాటు వివిధ ప్రాంతాల్లో పెయింటింగ్స్ వేశాం. ప్రజలు హాయిగా అందమైన వాతావరణంలో గడిపేలా రూ.7.25కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. మరో రూ.2.20 కోట్లతో విజయాదిత్య పార్కును అభివృద్ధి చేయనున్నాం. వీటితో పాటు రూ.10 కోట్లతో చేపట్టే రోడ్డు పనులు పూర్తయితే నగరం మరింత ఆకర్షణీయంగా కనబడనుంది.

– ఓబులేష్, కమిషనర్, శ్రీకాకుళం నగర పాలక సంస్థ